క్లుప్తంగా

నాణ్యతగా మధ్యాహ్న భోజనం

ఐరాల: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరని వంట ఏజెన్సీ సభ్యులకు ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆహార పదార్థాల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

నేడు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ రాక

తవణంపల్లె: ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి బృందం శుక్రవారం తవణంపల్లె మండలంలో పర్యటిస్తుందని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు బృందం సూచనలు ఇస్తుందని పేర్కొన్నారు.

నేడు వీరబ్రహ్మంగారి ఆలయ కుంభాభిషేకం


నూతనంగా నిర్మించిన ఆలయం

యాదమరి: మండలంలోని పెరుమాళ్లపల్లెలో శ్రీవీరబ్రహ్మంగారి ఆలయ కుంభాభిషేకం శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్మాణ దాతలు రాజారెడ్డి, మల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో హోమ పూజలు నిర్వహించారు. సాయంత్రం విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించారు. శుక్రవారం మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నట్లు నిర్మాణ దాతలు తెలిపారు.

నేడు మదనపల్లెలో జాబ్‌మేళా

పుంగనూరు: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మదనపల్లె బీటీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పది నుంచి ఆపై తరగతులు చదివిన వారందరూ మేళాకు హాజరుకావచ్చన్నారు. ఉదయం 10 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని, పలు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి, అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని వివరించారు.

లోక్‌అదాలత్‌పై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సోమల: పుంగనూరు కోర్టులో శనివారం నిర్వహించనున్న లోక్ అదాలత్‌పై పోలీసులు గురువారం అవగాహన కల్పించారు. స్థానిక బస్టాండ్ కూడలి నుంచి ర్యాలీ నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ బాలచంద్ర మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీకి ఆస్కారమున్న కేసులను వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు.

అడవికి నిప్పు పెడితే చర్యలు


అడవిని పరిశీలిస్తున్న ఫారెస్టు సిబ్బంది

వడమాలపేట: వేసవి కాలంలో అడవికి నిప్పు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని పుత్తూరు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. ఆయన గురువారం వడమాలపేట మండలం ఎస్వీపురం రెవెన్యూ పరిధిలోని అడవిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొండలకు నిప్పు పెట్టడం వల్ల ఎన్నో జంతువులకు ఆహారం దొరకదన్నారు. అలాగే చెట్లతోపాటు జీవులు కాలిబూడిదవుతాయని పేర్కొన్నారు. ఎవరైనా అడవికి నిప్పు పెడితే వెంటనే ఫారెస్టు అధికారులకు తెలియజేయాలని కోరారు. సిబ్బంది శివరాజు, చంద్రబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

కార్వేటినగరం: మండలంలోని గాజంకి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి డీఈ చిన్నరెడ్డెప్ప గురువారం స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదేశాల మేరకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నూతన కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ అరోహరరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మురగయ్య, పంచాయతీ కార్యదర్శి మనోఘ్న పాల్గొన్నారు.

నగర పాలక స్టాండింగ్ కమిటీ సమావేశం


సమావేశంలో మేయర్ అముద, కమిషనర్ అరుణ

- పలు అభివృద్ధి పనులకు ఆమోదం

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నగరపాలక స్టాండింగ్ కమిటీ ఆమోదముద్ర వేసింది. నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశం నగరపాలక కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. సమావేశంలో మేయర్ ఎస్.అముద, కమిషనర్ జె.అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆర్.చంద్రశేఖర్, ఆర్‌జి.శ్రీకాంత్, సి.శోభ, ఏజీ.సహదేవన్ పాల్గొన్నారు. సమావేశంలో అజెండా, టేబుల్ అజెండాలో పొందుపరచిన పలు అభివద్ధి పనులపై చర్చించి ఆమోదించారు.

స్టాండింగ్ కమిటీ తీర్మానాలు

- చిత్తూరు నగరపాలక సంబంధించి వాహనాల షెడ్డు ప్రాంగణంలో ఉన్న పాత ఇనుప వస్తువులకు నిర్వహించిన వేలంలో హెచ్చు పాటదారులకు ఎల్ఓఏ ఇవ్వడానికి..
- కాలుష్య నియంత్రణ మండలి నిధులతో 8వ వార్డు పరిధిలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి సర్కిల్ అభివృద్ధి, ఆర్టీసీ బస్టాండ్ డివైడర్‌లో పచ్చదనం పెంపు పనులకు ఆహ్వానించిన టెండర్లలో ఎల్1గా నిలిచిన బిడ్డర్‌కు ఎల్ఓఏ జారీ చేయడం.
- ఎమ్మెస్సార్ సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు ప్రస్తుతమున్న ఐరన్ గ్రిల్ డివైడర్ల స్థానంలో ప్రీకాస్ట్ ఆర్‌సీసీ మౌల్డ్స్ ఏర్పాటు చేయడానికి ఆహ్వానించిన టెండర్లలో ఎల్1 గా నిలిచిన బిడ్డర్‌కు ఎల్ఓఏ జారీ చేయడం.
- వివిధ డివిజన్లలో అద్దె ట్యాంకర్లతో నీటి సరఫరా చేయడానికి ఉద్దేశించిన టెండర్లలో ఎల్1 బిడ్డర్‌కు ఎల్ఓఏ జారీ చేయడానికి స్టాండింగ్ కమిటీ ఆమోద ముద్ర వేసింది. సమావేశంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ ధనలక్ష్మి, ఏసీపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

పూతలపట్టు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. గురువారం మండలంలో చింతమాకులపల్లె జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణాలు సగం పూర్తి చేసి చాలా మంది నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. బిల్లులు మంజూరైనా పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తిచేయాలని తెలిపారు. హౌసింగ్ అధికారులు పనులు పూర్తి అయ్యేలా పరిశీలించాలన్నారు. 1870 ఇళ్లకు గానూ 700 పూర్తయినట్లు ఎంపీడీఓ తెలిపారు. డీఈ సుబ్రమణ్యం, ఏఈ శ్రీనివాసులు, సర్పంచ్ నిర్మల, పంచాయతీ సెక్రటరీ రూన్సీ రాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

తవణంపల్లె: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని గోవిందరెడ్డి పల్లె, పుణ్యసముద్రం, ఎగువ తవణంపల్లె సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అం దుబాటులో ఉంటూ సత్వర సేవలు అందించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేయించాలన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్


తవణంపల్లె పీహెచ్‌సీలో

పూతలపట్టు: ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా పూతలపట్టు పీహెచ్‌సీలో గర్భిణులకు ప్రత్యేక వైద్య చికిత్సలు నిర్వహించారు. గురువారం వైద్యాధికారులు ప్రియంక, ప్రవీణ ఆధ్వర్యంలో 62 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. రక్త హీనత లోపం, చక్కెరవ్యాధి, రక్తపోటు, ఈసీజీ తదితర పరీక్షలు చేసి రిజిస్టరులో నమోదు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీ పీహెచ్‌సీలో గర్భిణులకు ప్రత్యేక వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. గర్భిణులు ఎక్కువసేపు విశ్రాంతి తీసుకోవాలన్నారు. పండ్లు, కూరగాయలు, ఉడికించిన గుడ్లు, మాంసం, పాలు ప్రతి రోజు తప్పని సరిగా తీసుకోవాలని తెలిపారు. తద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, సూపర్‌వైజర్ నూర్జహాన్, శేషాద్రి పాల్గొన్నారు.

సురక్షిత ప్రసవాలే లక్ష్యం

ఐరాల: మాతా, శిశు మరణాలను తగ్గించేలా సురక్షిత ప్రసవలే లక్ష్యంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం పీహెచ్‌సీలో పీఎం సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పలు ఆరోగ్య సూచనలు ఇచ్చారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షిత మన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

తవణంపల్లె: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. గురువారం పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద 40 మంది గర్భిణులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సూపర్ వైజర్లు జయమ్మ, అమరావతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు, ల్యాబ్‌టెక్నీషియన్ శేఖర్ పాల్గొన్నారు.

స్కానింగ్ కోసం ప్రదక్షిణలు

– సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు

చిత్తూరు రూరల్: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ గర్భిణి స్కానింగ్‌కు వస్తే మూడు రోజుల నుంచి ప్రదక్షిణలు చేయించుకుంటున్నారని నిరసిస్తూ బాధితురాలి కుటుంబ సభ్యులు గురువారం ఆ విభాగం వద్ద గొడవకు దిగారు. అక్కడి సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంతో గర్భిణి కుటుంబీకులు సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశా రు. ఆయన స్పందించారు. స్కానింగ్ చేయాలని స్కానింగ్ విభాగ సిబ్బందిని ఆదేశించారు. ఫిర్యా దుదారులతో మాట్లాడి శాంతింపజేశారు.

నేడు వాహనాల వేలం

కుప్పం: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను శుక్రవారం పట్టణంలోని ఎస్ఈబీ స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగలవారు రూ.5 వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

వైభవంగా సల్లాపురెమ్మ జాతర


అమ్మవారి సేవలో వైఎస్సార్‌సీపీ నేతలు

బైరెడ్డిపల్లె: మండలంలోని కొత్తయిండ్లు గ్రామంలో బుధవారం రాత్రి వైభవంగా సల్లాపురెమ్మ జాతర నిర్వహించారు. పొలిమేరలోని అమ్మవారి శిరస్సుకు ప్రత్యేక పూజలు చేశారు. పురవీధుల్లో ఊరేగించి గురువారం ఉదయం ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రాజంపేట నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, సర్పంచులు రమణారెడ్డి, కృష్ణారెడ్డి, బాలకృష్ణగౌడ్, వెంకటేష్ ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, వినాయకం, సురేష్, లక్ష్మమ్మ తదితరులు అమ్మవారిని సేవించుకున్నారు.

గజ బాధితులకు పంట నష్ట పరిహారం


కొదలమడుగులో గజ బాధితులకు చెక్కులు అందజేస్తున్న సర్పంచ్ మాలతి, రేంజ్ అధికారి నయీమ్ అలీ

బంగారుపాళెం: మండలంలోని కొదలమడుగు, కీరమంద, మొగిలివారిపల్లె పంచాయతీలలో ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు గురువారం సాయంత్రం అటవీశాఖ అధికారులు పరిహారం చెక్కులు అందజేశారు. పలమనేరు రేంజ్ అధికారి నయీమ్‌అలీ మాట్లాడుతూ, అటవీ సరిహద్దు గ్రామాల్లో ఏనుగుల దాడుల మూలాన పంట నష్టపోయిన రైతులకు అటవీశాఖ నష్టపరిహారం ఇస్తోందన్నారు. కొదలమడుగు సర్పంచ్ మాలతీ మాట్లాడుతూ, కొదలమడుగు, బండ్లదొడ్డి, సామచేనుమిట్ట, కీరమంద, వేపనపల్లె, టేకుమంద, మొగిలి, మొగిలివారిపల్లె గ్రామాల్లో ఏనుగులు ప్రతి ఏటా పంటలపై దాడులు చేస్తున్నాయని, దాంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలపైకి ఏనుగులు రాకుండా కట్టడి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ రమేష్, ఎంపీటీసీ రవీంద్ర, అటవీశాఖ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

13న చేపల చెరువుల వేలం

సోమల: మండలంలోని కందూరు పంచాయతీలో ఉన్న చెరువులు, కుంటల్లో చేపలను ఈ నెల 13వ తేదీన వేలం వేయనున్నట్లు కార్యదర్శి జైశంకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి గలవారు నిర్దేశిత డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన


పుంగనూరు: మాట్లాడుతున్న ఏడీ నాగపద్మిని

పలమనేరు: గంగవరం మండలం కీలపట్లలో చిరుధాన్యాల సాగుపై మహిళా రైతులకు జిల్లా వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు నాగపద్మిని గురువారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య రక్షణపై శ్రద్ధ పెరిగినందును భవిష్యత్తు చిరుధాన్యాలదే అన్నారు. సేంద్రియ విధానంలో చిరుధాన్యాలను పండిస్తే మంచి డిమాండ్ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ హేమలత పాల్గొన్నారు.

పుంగనూరు: పట్టణంలోని మేలుపట్లలో చిరుధాన్యల సాగుపై మహిళా రైతులకు శిక్షణ ఇచ్చారు. నాగపద్మిని మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రాజేష్, ఏఈఓ జయంతి పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లెలో మహిళా రైతులకు చిరుధాన్యాల సాగు, సేంద్రియ వ్యవసాయంపై జిల్లా వనరుల కేంద్రం అధికారి లక్ష్మీ ప్రసన్న అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఏఓ రజీబా, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, నాయకులు కృష్ణప్ప, సురేంద్రరెడ్డి, వీఏఏ బాలాజీ పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం


మాట్లాడుతున్న డీఎస్పీ రవికుమార్

పాలసముద్రం: ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని డీఎస్పీ రవికుమార్ ఆదేశించారు. గురువారం పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ మండలం తమిళనాడు సరిహద్దులో ఉండడం వల్ల కట్టుదిట్టంగా నిఘా పెట్టాలని సూచించారు. ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని కోరారు. అనంతరం రికార్డులు పరిశీలించారు కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి ప్రాధాన్యం


రేషన్‌షాపులో తనిఖీ చేస్తున్న విజయ్ ప్రతాప్ రెడ్డి

కుప్పం: విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం రామకుప్పం బాలుర ఉన్నత పాఠశాలు, గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాడు–నేడు పథకం కింద సర్కారు బడుల రూపురేఖలు మారాయన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమై భోజనం వడ్డిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరాలని కోరారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారి రబ్బానీ బాషా పాల్గొన్నారు.

పెద్దపంజాణి: రేషన్ కార్డుదారులకు సక్రమంగా ఉచిత బియ్యం పంపిణీ చేయాలని విజయ్ ప్రతాప్ రెడ్డి ఆదేశించారు. గురువారం మండలంలోని అమ్మరాజుపల్లె రేషన్ షాపు, అంగన్ వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలో పంపిణీ చేయాల్సిన బియ్యం కంటే తక్కువగా ఉండటంతో డీలర్‌పై చర్య తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు


ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గురువారం మండలంలోని తెల్లరాళ్ల పల్లె పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్‌తో తెలియజేశారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా పలు పథకాల అమలుతో ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి పట్టం కట్టిందన్నారు. అలాగే అభివృద్ధి కూడా చేస్తోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని కోరారు.

–ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

సిమెంటు రోడ్లు వేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని ప్రజలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.. అర్హులైననూ కొందరికి పింఛన్ రావడం లేదని నివేదించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. సంబంధిత అధికారులు వీటిని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్ బాబు, ఎంపీడీఓ శివరాజ్, తహసీల్దార్ చిట్టిబాబు, వివిధ శాఖల అధికారులు, నాయకులు మనోహర్ రెడ్డి, గొందివాళ్లవూరు బాబు, భజలింగం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత, నలిశెట్టిపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ దాత్రేయచౌదరి

ఐరాల: సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత అన్నారు. గురువారం మండలంలోని పేరయ్యగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 45 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపి ణీ చేశారు. రక్త పోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణు లు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నలిశెట్టిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: నలిశెట్టిపల్లెలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో మండల వైద్యాధికారి డాక్టర్ దాత్రేయచౌదరి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 125 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామాల్లో ప్రజల ముంగిటకే వచ్చి వైద్యం అందిస్తామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు ఛిద్రం


పాలేరు వద్ద అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బంగారుపాళెం: యువత మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితాలు నాశనం అవుతాయని సీఐ నరసింహారెడ్డి తెలిపారు. మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై గురువారం పోస్టర్ల ద్వారా ప్రజా చైతన్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గంజాయి, బ్రౌన్‌షుగర్, హెరాయిన్, మద్యానికి యువత దూరంగా ఉండాలని తెలిపారు. వీటికి బానిస అయితే కలిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్ కలిగి ఉన్నా, సరఫరా చేసినా కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరుకల్లా అర్బన్ ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణం


అనుప్పల్లె లేఅవుట్ పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలో ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలను నెలాఖరులోగా పూర్తి చేయాలని నగర కమిషనర్ జె. అరుణ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ గురువారం ఉదయం మాపాక్షి అర్బన్ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఇంకనూ చేయాల్సిన పనుల గురించి ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఫిబ్రవరి నెలాఖరుకు భవనాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం నగరపాలక పరిధిలో నిర్మాణ దశలో అర్బన్ ఆరోగ్య కేంద్రాల పురోగతిపైన ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు కమిషనర్ అనుప్పల్లె జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పునాదులు పూర్తి చేసిన లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈ ధనలక్ష్మి, డీఈ వెంకట ప్రసాద్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఎంఈ శ్రీలత, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సంక్షేమమే లక్ష్యం


మాట్లాడుతున్న పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి

- ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి

పలమనేరు: పట్టభద్రుల సంక్షేమమే లక్ష్యంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల వాణిని శాసన మండలిలో వినిపించే అవకాశం కల్పించాలని కోరారు. తొలి ప్రాధాన్యతా ఓటుతో అండగా నిలవాలని విన్నవించారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, డీఎస్సీ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించేందుకు పాటు పడతామని వెల్లడించారు. ప్రైవేటు కళాశాలల్లో పనిచేసే లెక్చరర్లకు ప్రభుత్వ గుర్తింపు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



మద్యం.. ధ్వంసం



పలమనేరు ఎస్ఈబీ పోలీసులు వివిధ ప్రాంతాల్లో సీజ్ చేసిన రూ.5లక్షల విలువైన కర్ణాటక మద్యాన్ని గురువారం ధ్వంసం చేశారు. అలాగే పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను రూ.9,04,470లకు వేలం వేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎల్లయ్య తెలిపారు.

– పలమనేరు